కథానిక

సుశీ - శశీ

మాధురి

"డాక్టర్ శేఖర్! మీకు ఫోన్ కాల్ వచ్చింది!" ఎత్తు మడమల బూట్లు చప్పుడు చేసుకుంటూ వచ్చి చెప్పింది నర్సు.

"ఊఁ...ఎక్కడినుండి?" తలెత్తకుండానే కేసు రికార్డ్సు చూస్తూ అన్నాడు శేఖర్.

"మిసెస్ శేఖర్!" అంది చిన్నగా నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

గాలికెగరకుండా కాగితాలమీద పేపరువెయిట్ పెట్టి చకచకా నడిచాడు ఫోనువద్దకు.

"హలోల్...రాగిణి! నేను నీ శేఖర్ని మాట్లాడుతోంది!" చిన్నగా అన్నాడు.

"నా శేఖర్...కాదు డాక్టర్ శేఖర్!" చాలా బాధగా పలికింది రాగిణి.

"రాగిణీ!" అన్నాడు ఉద్రేకంగా. "అలా బాధపడుతావేం. అక్కడున్నా, ఇక్కడున్నా నా మనస్సంతా నీ దగ్గరే వుంటుంది. అయినా అయిన దానికి అలా బాధపడుతూ కూర్చుంటే ఏం లాభం చెప్పు. ఇంకా ముందు ఎన్ని కష్టాల నెదుర్కోవాలో మనకేం తెలుసు...ఛీ! ఏడుస్తున్నావా?...గతించిన విషయాలు మర్చిపోవటం మంచిది రాగిణీ! ఆ బాధతోటే మనస్సంతా ఎందుకు పాడుచేసుకుంటావు? ఎప్పుడూ ఏదో ఒక పుస్తకం పట్టుకొని బాధ మరిచి ఎందుకు కూర్చోగూడదు?"

అవతల ఫోను పెట్టిన శబ్దమయింది. బాధగా నిట్టూర్పు విడిచాడు శేఖర్. ఫోను పెట్టి తిరిగి తీసుకొని తన యింటికి కనెక్టు చేయమన్నాడు.

"రాగిణీ!" అన్నాడు చిన్నగా.

"రోజూ చెప్పేదేగా?" అంది.

చిన్నగా ఏడుస్తున్న శబ్దం ఇంకా వినిపిస్తూనే ఉన్నది శేఖర్కి.

"రాగిణీ! నేను యింకో పావుగంటలో వస్తాను. టాయిలెట్ అయి రెడీగా వుండు. సినిమాకు వెళదాం!" ఫోను పెట్టేశాడు. తనకు తెలుసు రాగిణి నుండి సమాధానం "రాలేను!" అని వస్తుందని.

గడియారం ఐదు తరువాత అరగంట కొట్టింది. తరువాత డాక్టర్ రఘు డ్యూటీలోకి వచ్చి శేఖర్ని రిలీవు చేశాడు. కోటును భుజాన వేసుకొని బయల్దేరాడు బయటకు శేఖర్.

తలుపు దగ్గరకు వచ్చేటప్పటికి డాక్టర్ రఘు గొంతు వినబడింది.

"డాక్టర్ శేఖర్..."

అతను వెనక్కు తిరిగాడు. ముందుకు చూశాడు కాని నడవలేకపోయాడు

"...మీరు మర్చిపోయారు డాక్టర్!"

శేఖర్కు దగ్గరగా వచ్చాడు చేతిలో చిన్న ఫోటోతో. అతని చేతికందించాడు.

"మీ సుశీ దేనను కుంటాను?"

"థాంక్యూ!" శేఖర్ కంటివెంట రెండు కన్నీటి బొట్లు రాలాయి.

"ఇంకా మీరు బాధపడుతూనే వున్నారా డాక్టర్?" రఘు చిన్నగా తలవంచుకొని అడిగాడు.

"మనుషులు పోయినా మమతలు పోలేవని నాకు తెలుసు...కానీ మీరే అలా బాధపడితే...డాక్టర్.. ఫోటో నలిగిపోతోంది."

గట్టిగా మూసిన శేఖర్ గుప్పిటనుండి ఫోటో కొనలు బయటకు కనిపిస్తున్నాయి.

"థ్యాంక్యూ డాక్టర్! ప్రయత్నిస్తాను...నేనే బాధపడితే నా రాగిణేమాతుంది?" చిన్నగా గొణుక్కుంటూ కారువద్దకు నడిచిపోయాడు శేఖర్.

కారులో పోతుంటే ఎన్నో పాతజ్ఞాపకాలు రోడ్డు మీద జనం ఎదురయినట్లే వీస్తున్నాయి. "తన మనస్సును తన గుప్పిటలో పెట్టుకోలేడు. తను గతించిన కాలాన్ని గతించినట్లుగా తలంచలేడు...తను

మనిషి...తనలో దేవత్వం లేదు...లేదు...సుశీ! లేదు. "నిన్నూ మీ నాన్న ఎన్నడూ మర్చిపోలేడు. మర్చిపోనీయడు నీమీద ప్రేమ సుశీ" అతని బుజాల మీదగా సుశీ వంగి మెడ వాటేసుకున్నట్లుగా ఫీలయ్యాడు. నిజంగా సుశీ ఆ కారులో ఉంటే అలాగే చేసి వుండేవాడు!...

శేఖర్ మెడిసన్ చదువుతున్నప్పుడే రాగిణిని పెండ్లి చేసుకున్నాడు. పెండ్లికూడా చాలా ఆడంబరంగా జరిగింది. తను కలయింటివాడు...రాగిణీ అంతే!

తను మెడిసన్ పూర్తిచేసి ఉద్యోగంలో జేరగానే రాగిణిని తీసుకొచ్చి మంచి యిల్లు అద్దెకు తీసుకొని కాపురం పెట్టాడు. చాలా ఆనందంగా గడిచిపోయినయి ఐదు సంవత్సరాలు. ఆరునెలలు రాగిణి తనకు వియోగం కలిగించినప్పటికి పండంటి పసిబిడ్డతో తిరిగి వచ్చింది పుట్టింటినుంచి.

శేఖర్ ఎంతో ఆనందించాడు. సుశీని ఎంతగానో ప్రేమించాడు. పిల్లవాడికి ఎంత ఆనందం చేకూర్చాలో అంతా చేకూర్చారు. డబ్బుకు వెనుకాడలేదు. రాగిణి సుశీ నెన్నడు వదిలేదిగాదు. సుశీ నవ్వితే తను నవ్వేది. ఏడిస్తే తను ఏడ్చేది. ఇంట్లో ప్రత్యేకంగా వంటమనిషిని పెట్టి, తన పనులను చాలావరకు తేలిక పరచుకొని సాధ్యమయినంతకాలం సుశీతోనే గడిపేది రాగిణి.

ఎదురుగా వస్తున్న కారులోనున్న స్నేహితుడు శేఖర్‌కు విష్ చేశాడు చిరునవ్వుతో. కాని శేఖర్ దానికి సమాధానం యివ్వగలిగింది ఆ కారు అర్ధ ఫర్లాంగు దూరం వెళ్ళిన తరువాత...

ఒకరోజు రాగిణిని తను ఎంతగా అరిచాడు? చేసింది చాలా చిన్నతప్పు...తను ఆఫీసునుండి వచ్చేటప్పటికి సుశీ ఏడుస్తున్నాడు...ఆరోజు తను పంతం పట్టి రాగిణి కళ్ళవెంట నీళ్ళు తెప్పించాడు...సుశీని ఏడిపించినందుకుగాను తనకదే శిక్ష పొమ్మన్నాడు.

శేఖరు తన కనుకొనలనుండి జారే కన్నీటిబొట్లను చిటికినవ్రేలి గోటితో తీసి వేశాడు.

"తనే రాగిణి – రాగిణే సుశీ – సుశే తను!" అనుకున్నాడు.

కారు పోర్టికోలో వచ్చి ఆగింది. కోటు బుజాన వేసుకొని, డోరు మూసి లోపలికి నడిచాడు.

"రాగిణి రేగిన జుట్టుతో, మాసిన బట్టతో, సోఫాలో మూలకు ఒదిగి కూర్చుంది...టాయిలెట్ కాలేదు!

♦ ♦ ♦

"రాగిణీ!" అన్నాడు సోఫాలో కూర్చుంటూ, "నీవెంత దుఃఖించినా నీ సుశీ యిక నీకు రాడు. తెరమరుగయిన వాడికోసరం నీవెందుకలా కృంగి కృశించిపోతావు..."

రాగిణి ఏహ్యంగా చూచింది ఆ మాటకు సమాధానంగా..."మీ మొగవారెంత నీచులు!" అన్నంతగా బాధపడ్డది.

అక్కడ ఒక్కక్షణం ఉండలేకపోయాడు... గదిలో మంచంమీద జేరి "ఎందుకు తనలా అన్నాను?" అని ఏడ్చాడు...రాగిణి ఎన్నడూ అలా ఏడ్చివుండదు.

సుశీ బల్లమీద ఫోటోలో ఎక్కిరిస్తున్నట్లుగా నవ్వుతున్నాడు!

♦ ♦ ♦

సాయంత్రం ఐదున్నరకు మామూలుగా డాక్టరు రఘు డ్యూటీలోకి వచ్చాడు. శేఖర్‌ను చూచేటప్పటికి అతడి హృదయం బాధపడింది... శేఖర్ మునుపటి శేఖర్‌లా లేడు!

మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చి శేఖర్ భుజంమీద చేయివేశాడు.

"డాక్టర్ శేఖర్!" చాలా బాధగా పలికాడు. బాహ్యంగా అంతకంటె తన బాధను వ్యక్తంచేయలేడు.

"..."తలెత్తి రఘు ముఖంలోకి చూచాడు శేఖర్. "ఇక వెళ్తాను" అన్నట్లుగా లేచి నిలబడ్డాడు.

"డాక్టర్, కూర్చో!" అన్నాడు రఘు. "డాక్టర్ ఒక విషయం చెబుతాను...నీలోగల శక్తి నాలోగూడ లేదు...ఆ కష్టం అనుభవించిన వ్యక్తులు చెప్పినట్లుగానే నేను చెబుతున్నాను" రఘు ప్రక్కనున్న కుర్చీలో కూర్చున్నాడు.

"సిగరెట్ తీసుకో!" అన్నాడు సిగరెట్ కేసు ముందుపెడుతూ - తనొకటి తీసుకొని లైటర్ వెలిగించి సిగరెట్టు వెలిగించుకున్నాడు. శేఖర్ ముఖం

లోకి చూచాడు. అతడు 'ఒద్దు' అని తల వూపాడు.

"ఒక డాక్టర్ గా నీవే నీబాధను మర్చిపోవాలి!"

రఘు లేచి కిటికి ప్రక్కగా నిలబడి పొగను బయటకు వదులుతున్నాడు.

"అది అసంభవమనుకుంటాను..."

"అది నీవు డాక్టరుగా అలవాటు చేసుకోవాలి!"

"విఫలుణ్ణయ్యాను" శేఖర్ లేచాడు. "సారీ డాక్టర్ ...వస్తాను. మర్చిపోయ్యాను చెప్పటం... ఒక నెలరోజులు శెలవ పెడదామనుకుంటున్నాను."

"కూర్చో డాక్టర్..." శేఖర్ దగ్గరగా వచ్చాడు రఘు. రెండు చేతులు బుజంమీద వేశాడు. ముఖంలో ముఖంపెట్టి కళ్ళల్లో కళ్ళుపెట్టి చూచాడు. "శేఖర్ ...కూర్చో!" అన్నాడు. "సిద్ధాంతరీత్యా పోయిన వస్తువు చోటులో అలాంటి వస్తువునే మరొకదాన్ని చేరిస్తే చాలావరకు దాని స్వంతదారుడు, లేక ఆత్మీయుడనబడేవాడు ఆత్మసంతుష్టి పొందగలుగుతాడనుకుంటాను..."

"అదెలా సాధ్యం... నా బాధ అలాంటి పదార్ధాన్ని గురించి కాదుగా!"

"శేఖర్! కాని...మీరు మరోలాగ అనుకోకపోతే నేనొక విషయం చెబుతాను" రఘు తాపీగా కూర్చున్నాడు.

"చెప్పండి .. దానికేం!"

"మనస్సులో బాధపడగూడదు ... నన్ను మాత్రం అపార్ధం చేసుకోవద్దు. అలా అని మాట యివ్వండి!" అని చేయిజాపాడు.

"రఘు! అలాగేబాస చేస్తున్నాను. ఇకముందు గూడ నీ మీద పూర్వపు భావమేవుంటుంది..." తల వంచుకున్నాడు.

"ఒక్క నిమిషం రఘు సంకోచించాడు..." మీరు అలాంటి మరోపిల్లవాడికే తండ్రి ఎందుకు కాగూడదు. ...మీ మనసుకి నచ్చిన మరొకడిని "సుశీ!" అని ఎందుకు పిలవగూడదు?... తన తలమీదనుండి పదు బరువు తగ్గినట్లుగా తేలికపడ్డాడు.

"అదెలాసాధ్యం?" విచిత్రం అతడి మొఖంలోకి చూచాడు. ఒక కాంతిలేని చిరునవ్వునవ్వాడు.

రఘు తడబడ్డాడు. చిన్నగాగొణిగాడు. "అనాధ శరణాలయంనుండి ఒకపిల్లవాడిని తెచ్చుకోగూడదా?" శేఖర్ మొఖంలోకి చూచాడు.

శేఖర్లో ఏలాంటి మార్పు లేకపోవటంతో రఘు హృదయంగూడ ఏలాంటి మార్పుచెందలేకపోయింది.

"డాక్టర్ శేఖర్ ... ఆలోచించుకో!"

"దాని వలన లాభంవుంటుందంటరా?"

"దానికిసమాధానం నేను చెప్పటమనేది భావ్యంగావుండదు ... నీ మిసెస్తో చర్చించు ... ఏ మాత్రమైనా ఫలితముంటుందనుకుంటేనే ప్రయత్నించు-నేను చేయగలిగిన సహాయమంతా చేస్తాను."

శేఖర్ లేచాడు ఇంటికి వెళ్ళటానికి. రఘు అడ్డు చెప్పలేదు.

రాత్రి రఘు చెప్పిన విషయంమీద తక్షణం ఆలోచించాడు. ఒక నిశ్చయానికి రావటంకోసరమై ... రాగిణితో ఇప్పుడు చర్చించి విఫలమయ్యేదానికంటె పిల్లవాడిని తీసుకువచ్చి ఒప్పించటమనేది తేలికగా ఉంటుందనుకున్నాడు ... అలాగే నిశ్చయించుకున్నాడు! రాత్రి పన్నెండుగంటలకు నిద్రపట్టింది...

♦ ♦ ♦

"రాగిణీ! ..." అన్నాడు చాలా చిన్నగా. "టాయిలెట్ అవ్వు ... పసుంది వెళ్దాం."

రాగిణి మాట్లాడలేదు ... తల ఎత్తలేదు.

"రాగిణీ!" అన్నాడు తిరిగి చిన్నగా "తొందరగా వెళ్లాలి ... త్వరగా కానీయ్!

ఎక్కడికన్నట్లుగా చాలా నీరసంగా చూచింది.

శేఖర్ కూండుగా "ఊహించినభావాలే మసకమసకగాకదుల్తున్నాయి ఆమెలో. "సుశీ కోసం!" అందామనుకున్నాడు. ఆ మాట అనివుంటే తను అక్కడ నిలబడివుండలేడు ... రాగిణి హృదయం వ్రక్కలయ్యేలా ఏడుస్తుంది ... మరణించిన సుశీ ఎన్నడూ తిరిగిరాలేడని రాగిణికి బాగాతెలుసు!

"నేను రాకుంటే పని ఆగిపోతుందా?" చాలా సహజంగా అడిగింది. తను ఇలాంటి ఎదురు ప్రశ్న ఎన్నడూ శేఖర్ని అడిగివుండలేదు.

"కాదనినేనను ... నాకేమాత్రం ఆత్మ సంతుష్టి వుండదు, ... కానీ, రాగిణి ... ప్లీజ్ ... ప్రతి

మాలుతున్నాను ... నీవు 'కాదు' అనకూడదు.” అన్నాడు మొఖానికి మొఖం దగ్గరిగా పెట్టి.

రాగిణి మొఖం ప్రక్కకు తిప్పుకుంది.

“ఈలాగే వస్తాను!”

“కాదు ..”

వడివడిగా బాత్‌రూమ్‌లోకి నడిచింది మారు మాట్లాడకుండా.

సరిగ్గా రాగిణి, శేఖర్ కారు దిగేటప్పటికి రఘు ఎదురువచ్చి “నమస్తే రాగిణీదేవి!” అన్నాడు.

“నమస్తే!” అంది. తలవంచుకుంది.

“క్లబ్బుకు రావటమే మానేశారు!”

రాగిణి ఏం మాట్లాడలేదు.

ముగ్గురు స్ప్రింగ్ డోర్ తెరుచుకొని లోపలికెళ్ళేటప్పటికి చిరునవ్వుతో బాలల శరణాలయం సెక్రటరీ ఆహ్వానించి కుర్చీలు చూపించింది.

“వీరు శ్రీమతి రేణుకాకుమార్ ... దీనికి సెక్రటరీ!” అన్నాడు రఘు పరిచయం చేసే దృష్టితో.

“నమస్తే!” అన్నారు శేఖర్ దంపతులు.

“అంటే ... ఏమిటిది?” అంది రాగిణి “దేనికి సెక్రటరీ వీరు?”

రేణుకాదేవి తలవంచుకుంది చిరాగ్గా

“అదే బాలశరణాలయానికి!” అన్నాడు రఘు

రాగిణి హృదయంలో అనుమానం అస్పష్టంగా కదిలింది. ఇప్పుడు వాళ్ళెందుకిక్కడికి వచ్చినట్లు! అనుకుంది.

“రఘు!” అన్నాడు. శేఖర్. “ఇక్కడనుండి త్వరగా వెళ్ళటమే నేది మంచిదనుకుంటాను!” అస్పష్టంగా గొణిగాడు.

“రేణుకాదేవి ... ఆలస్యం ఏమీ లేదనుకుంటాను?” అన్నాడు. భావగర్భంగా రాగిణికి అసలువిషయం తెలియదని రఘుకుగూడ తెలుసు.

రఘు, శేఖర్ లిద్దరు ఎవరికి వారు ముందు ఏమి జరుగుతుందా అని ఆదుర్దాతో కుర్చీలో ముందుకు జరిగి కూర్చున్నారు.

ఇంతలోకి ముగ్గురు పిల్లల నెత్తుకున్న ఆడవాళ్ళు ఆ గదిలోకి వచ్చారు.

“రాగిణీ!” అన్నాడు శేఖర్ చాలా బాధగా. “మన సుఖీ ఎవరో ఎన్నుకో!”

రాగిణికి తల తిరిగినంత పనయింది. అనుకోని సంఘటనకు ఆమెలో తుఫాను రేగింది. కోపం కట్టలు తెంచుకు ప్రవహించింది. క్రింది పెదిమను నెత్తురు కారేలా పంటితో నొక్కుకుంది. మొఖాన చేతులు కప్పుకొని వలవల ఏడ్చింది... ఉద్వేగంగా కుర్చీనుండి లేచింది.

“శేఖర్!” అంటూ బయటకు పరిగెత్తింది.

కారులో కూర్చొని డోరు మూసిన చప్పుడు లోపల కూర్చున్నవారికి వినబడింది.

ఊహించని సంఘటన జరిగినప్పుడు ఎంత నిశ్శబ్దమావరిస్తుందో అలాగేవుంది ఆ గది కూడ.

“రఘూ!..” అన్నాడు శేఖర్.

“రేణుకాదేవి!” అన్నాడు రఘు. “ఆ క్షమించాలి... ఆమె ప్రవర్తనకు మీరేమీ బాధపడరనుకుంటాను!”

సమాధానంగా రేణుకాదేవి నవ్వింది — ఎంతో అనుభవమున్నదానిలా?

ఆ ముగ్గురిలోకి ముచ్చటగా ఉన్న అబ్బాయిని ఎత్తుకొని ముద్దుపెట్టుకున్నాడు శేఖర్! “థాంక్స్ రేణుకాదేవి!”

“వస్తా రేణుకాదేవి” రఘు గూడా లేచాడు.

సెక్రటరీని వదిలి చాలా దూరం వచ్చిన శేఖర్ భుజంమీద చేయివేసి రఘు అన్నాడు. “ప్రయత్నించు శేఖర్! ఫలితం శూన్యమైతే తిరిగి తీసుకు వచ్చేద్దాం!” పోర్టికోలో ఉన్న తన కారులో కూర్చొని వెళ్ళిపోయాడు.

శేఖర్ భయం భయంగా పిల్లవాడిని తీసుకువచ్చి “తలుపు తీయి రాగిణీ!” అన్నాడు.

ఆమె ఏడుపు పెద్దదయింది. అతడివేపు చూచిన రాగిణి చూపు భయంకరంగా వున్నది.

ఇక లాభంలేదనుకున్నాడు శేఖర్. తనే ఒక చేత్తో పిల్లవాడి నెత్తుకొని తలుపు తెరిచాడు. రాగిణి ఒక మూలకు జరిగింది. ఆమెకివతల ప్రక్కగా పిల్లవాడిని పడుకోబెట్టాడు.

రాగిణి ఏడుపు ఏమాత్రం తగ్గలేదు.

పిల్లవాడు నోట్లో వేలేసుకొని చీకుతూ నవ్వుతున్నాడు!

కారులు పోతూ "రాగిణీ!" అన్నాడు ఉండబట్టలేక. తిరిగి ఏమీ సమాధానం రాకపోయేటప్పటికి మెదలకుండా ఊరుకున్నాడు.

జరగబోయే సంగతులేవీ ఊహించటమనేది ఆ సమయంలో కష్టంగాదు కాబట్టి అంతగా బాధపడలేదు - తనకు తెలుసు రాగిణి బాధ!

"రాగిణీ! నేను చేసినపని నీకు కష్టం కలిగిస్తే—" అన్నాడు. "క్షమించు!" గొణిగాడు.

రాగిణి దానికి ఏమీ సమాధానం చెప్పలేదు. చిన్నగా ఆలోచించ సాగించి శేఖర్ చెప్పింది సమంజసమో కాదోనని — ఏది ఏమైనా శేఖర్ చాలా తొందరపడ్డాడు — అదే అనేసింది!

"మీరు చాలా తొందరపడ్డారు!"

"అవ్వచ్చు రాగిణీ! మన బాధను మర్చిపోటానికి ఇదొక్కటే సాధనమనిపించింది!" జవాబిచ్చాడు శేఖర్.

రాగిణి చీర చెరుగుతో ఒకసారి మొఖం తుడుచుకుంది.

పిల్లవాడు కారు అమరుడికి ఏడ్వటం మొదలుపెట్టాడు.

రాగిణి ఇప్పుడు ఇరకాటంలో పడింది. ఒకసారి పిల్లవాడివంక చూచింది. తిరిగి మొఖం త్రిప్పుకొని వలవలా ఏడ్చింది.

"కారు ఆపమంటావా?" అడిగాడు శేఖర్. పరిసరప్రాంతం చూడముచ్చటగా వుంది. ఒకవైపు అందమైన తోటలు. మరియొకవైపు నిశ్శబ్దంగా పయనిస్తున్న నదీజలాలు. ప్రకృతైనా రాగిణి మనస్సుకు ఊరట కలిగిస్తుందేమోనని అతడి ఆశ!

"వద్దు పోనీయండి!" అంది. ఆమె హృదయాన్ని సమాధానపరుచుకోబోయింది.

గాలికెగురుతున్న చీర చెంగును తలమీదగా కప్పుకుంది. చారలుకట్టిన చెంపల్లో, వెలుగులేని నేత్రాల్లో, వినోదం ఎండిన వదనంలో సూక్ష్మాతిసూక్ష్మంగా ఏదో వెలుగు వెలిగింది. వణుకుతున్న చేతులతో పిల్లవాడి నెత్తుకుంది. ముద్దు పెట్టుకుంది.

"తను గతించిన సుశీని, బాధలని మరవాలి!" మనస్సును గుప్పిటలోకి తెచ్చుకొని అనుకుంది.

శేఖర్ తన ముందున్న అద్దంలో ఇదంతా చూచాడు. ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు.

"రాగిణీ! మన సుశీలా లేదు!" అన్నాడు.

"అంతే! వలవలా ఏడ్చింది. కన్నీటితో మొఖమంతా తడిసిపోయింది.

శేఖర్ గతుక్కుమన్నాడు. - చాలా బాధపడ్డాడు. "పోనీలే, శశీ అని పిలుద్దామా?" అన్నాడు అనునయిస్తూ.

పిల్లవాడు ఆమె చేతులలో హుషారుగా నవ్వుతున్నాడు తన చిన్నారి చేతులతో రాగిణి చెంపల మీద ఆడుతున్నాడు - అది ఆమెకు తన కన్నీరు తడుస్తున్నట్లుగా వున్నది.

"శశీ!" అంది. బుగ్గలు కందిపోయేలా ముద్దుల వర్షం కురిపించింది.

స్త్రీ ఏలాంటి అనుభూతిని దాచుకోలేదు!

Grihalakshmi - Feb -61.